జజ్జనకరి జనారే...ఊరూరా జాతరే

జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ఘటాల ఊరేగింపు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఉత్సవాలకు వచ్చిన బంధుమిత్రులతో పల్లెలు కోలాహలంగా ఉన్నాయి.


మారేడుమిల్లి లో అమ్మవారి బోనాలను ఊరేగిస్తున్న మహిళలు


గంగవరంలో నృత్యం చేస్తున్న గిరిజన యువతీ యువకులు

గంగవరం : గిరిజన గ్రామాల్లో సంబరంగా గ్రామ దేవతలు పండగలు జరుగుతున్నాయి. వర్షాలు బాగా పడి, పాడి పంటలు బాగా వృద్ధి చెందాలని, అందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటూ ప్రతి ఏటా మే నెలలో మూడో మంగళవారం నుంచి జూన్ నెలలో రెండో మంగళవారం వరకు ఒక్కో వారం ఒక్కో గ్రామంలో గంగాలమ్మ, భూ దేవి జాతరలను నిర్వహిస్తారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు, రేలారే రేల పాటలు, కోలాటాలతో జాతరల్లో యువతీ యువకలు పాల్గొంటారు. పొలిమేర్లలో గ్రామ దేవతల గుడుల వద్ద, గ్రామదేవతలు కొలువుగా కొలిచే వృక్షాల ఉండే ప్రాంతాల్లో భారీ ఊయలను ఏర్పాటు చేస్తారు. జాతర సందర్భంగా గ్రామాల్లో గిరిజనులు వివిధ వేషధారణలతో ఆకట్టుకోవడం తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. గంగవరంలో సోమవారం నుంచి జాతర ప్రారంభమైంది. బుధవారం వరకు మూడు రోజుల పాటు గంగాలమ్మ, భూదేవి పండగలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. గ్రామంలో అమ్మవారి కలశాన్ని ఊరేగించారు. భారీగా గిరిజన మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు జరిపారు.


మారేడుమిల్లిలో గంగాలమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

మారేడుమిల్లి : మారేడుమిల్లి గ్రామ దేవత మాతృ శ్రీ కనకవర్షిణి గంగాలమ్మ తల్లిఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళ్లు మిరమిట్లు గొలిపే విద్యుత్‌దీపాలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. ముందుగా అమ్మవారికి కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాల ఊరేగింపు, గిరిజన పూజారులచే అమ్మవారికి పూజా కార్యక్రమం సాయంత్రం గరగలాట, థింసా, తిన్మార్ తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

ఘనంగా ముగిసిన మోదకొండమ్మ ఉత్సవాలు


ఉత్సవానికి పోటెత్తిన భక్తులు

- వైభవంగా అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాల ఊరేగింపు
- పోటెత్తిన భక్తులు

పెదబయలు: మండల కేంద్రం పెదబయలులో ఆదివారం నుంచి ప్రారంభమైన మోదకొండమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి తెల్లవారుజాము నుంచి ఒడిశా రాష్ట్రం, జిల్లాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాయంత్రం 4 గంటలకు శతకంపట్టు నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలతో భారీ ఊరేగింపు ప్రారంభించారు. శతకంపట్టు నుంచి సీతగుంట వరకు, అక్కడ నుంచి అమ్మవారి గుడి వరకు ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా భారీగా బాణసంచా కాల్చారు. ఊరేగింపులో పులి వేషాలు,శక్తి వేషాలు,బేతాల వేషాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి గుడివద్ద రాత్రి 8 గంటలకు భారీగా మందుగుండు కాల్చారు. జి. మాడుగుల సీఐ రమేష్,ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ముగింపు ఉత్సవంలో గ్రామ పెద్దలు గంపరాయి సూరయ్య,దడియా రాంబాబు, రామూర్తి,ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, పూర్ణచందర్, రూడ లక్ష్మణరావు,కమిటీ నాయకులు చెండా చిట్టిబాబు,నీలయ్య, లాలీబాబు,పాంగి సింహాచలం, పూర్ణయ్య, ఉద్యోగులు,ఉపాధ్యాయులు,వర్తకులు,మోటర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ఊరేగిస్తున్న నాయకులు, గ్రామ పెద్దలు


ఆకట్టుకున్న పులి వేషాలు

ప్రసాదాల పంపిణీ

మోదకొండమ్మ ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయం ఆవరణలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతగిరి ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గంపరాయి సూరయ్య,మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. వ్యాపారి పండా శ్రీను కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పొంగలి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈవో కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వంతాల ఆనందరావు, మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రూడ లక్ష్మణరావు, కూడ అనంతరావు, కనకరాజు,ఉపాధ్యాయులు తలారి చక్రధర్, కుంబిడి శేఖర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ప్రసాదం పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ

క్లుప్తంగా

పాడేరు ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


విశ్వేశ్వరరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చింతపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతపల్లిరూరల్: పాడేరు ఎమ్మెల్యేగా ఎన్నికైన మత్స్యరాస విశ్వేశ్వరరాజుని చింతపల్లి ఎంపీపీ అనూషదేవి, సర్పంచ్ దురియా పుష్పలత, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంగళవారం ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజును దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం


ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రం అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం దర్శించుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలోస్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు.అనంతరం కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని సూపరింటెండెంట్ వెంకటరమణ అందజేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమించకుండా చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు,రెవెన్యూ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన డీఫారం భూములు సంబంధిత వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయో, లేదో చూడాలని సిబ్బందిని ఆదేశించారు. లేకపోతే వాటిని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులకు అప్పగించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అవసరాలకు గతంలో ఇచ్చిన భూముల వివరాలను సేకరించి నివేదిక ఇవ్వాలని కోరారు.

బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

జి.మాడుగుల: మండలంలోని గాంధీనగరంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 4,5 తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హతైన విద్యార్థినులు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పి.సుభద్ర తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను నాలుగో తరగతిలో 10 సీట్లు, ఐదో తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. గిరిజన బాలికల తల్లిదండ్రులు పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సంప్రదించాలని ఆమె కోరారు.

అధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది

కూనవరం: కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఎళ్లవేళలా అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని ఆపార్టీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సానుభూతి పరులపైన దాడులు జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడికీ మేలు చేసిందని, కులమతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేసిందని పేర్కొన్నారు సచివాలయ వ్యవస్థ, వలంటరీల ద్వారా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పింఛన్లు, సర్టిఫికెట్లు, ఇతర పథకాలను ఇళ్లవద్దే అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేని తెలిపారు.

మలేరియా నిర్మూలనకు చర్యలు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరాజు

వై.రామవరం: సీజన్ మారుతున్న తరుణంలో మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని అసిస్టెంటు మలేరియా అధికారి(ఏఎంవో) శ్రీనివాసరాజు సిబ్బందికి సూచించారు. ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహనసదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది మలేరియా కేసులు నమోదుకాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో యాంటీ లార్వా ఆపరేషన్స్, ఫాగింగ్, దోమల నివారణ మందు పిచికారీపై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శివకుమార్, మలేరియా టెక్నీషియన్ పి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్


డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు కళాశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగించి, చెత్తచెదారం బయటకు పారవేసి, శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, అనితకుమారి, అధ్యాపకులు గణేష్, కొండబాబు, సుందరిరాణి,లచ్చన్న, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని, ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా కూరగాయలు, ఇతర పంటలను పండించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలని ఐకేపీ ఏపీఎం సుందరమ్మ తెలిపారు. గ్రామైక్య సంఘంలోని రైతులు, మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం మండల కేంద్రం జి.మాడుగులలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సారాన్ని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన పంటలు పండించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులు ప్రతి వారం అమ్మకాలు జరిగేలా చూడాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి మేడ ప్రసాద్, భీరం యూనిట్ ఇన్‌చార్జి రామలింగం , వెలుగు మిత్ర సీసీ నారాయణరావు, డీపీఎం కార్యాలయ డివిజన్ కోఆర్డినేటర్ గణపతి, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను పరిశీలిస్తున్న వెలుగు ఏపీఎం సుందరమ్మ

అయ్యరక స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా


నర్సీపట్నం: అయ్యరక స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేసినట్లు ఆమె తెలిపారు. తనకు పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి, రాంగోపాల్ దంపతులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు అధైర్య పడొద్దన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. మళ్లీ పార్టీ విజయం కోసం కృషి చేస్తామన్నారు.

‘మండల కేంద్రాల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు’


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు కృష్ణారావు,ఆనంద్

హుకుంపేట: 5వ షెడ్యూల్ ప్రాంతంలో అమలులో ఉన్న 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడానికి ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు కంకణం కట్టుకున్నారని, ఈ నేపథ్యంలోనే జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకోవడం లేదని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తాపుల కృష్ణారావు అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని చెప్పారు. దీనిపై అధికారులకు ఎన్నో సార్లు వినతులు ఇచ్చినా, ఉద్యమాలు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఇకనైనా మండల కేంద్రాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


గోకులపాడులో ఇంటిని ఢీకొట్టిన లారీ

ఎస్.రాయవరం : గోకులపాడు గ్రామంలో ఓ ఇంటిపై లారీ దూసుకొచ్చింది.విశాఖపట్నం నుంచి కర్నాటక వెలుతున్న లారీ గోకులపాడు సమీపంలోనికి వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తులోనికి జారుకోవడంతో రోడ్డు పక్కన ఉన్న శ్లాబ్ ఇంటిని బలంగా ఢీకొట్టింది. ఇంటిని ఢీకొట్టే ముందు షెడ్డు, మరుగుదొడ్డిని ఢీకొని ఇంటిని ఢీకొట్టి ఆగింది. మరింత ముందుకు వస్తే ఇల్లు కూలి, ఇంట్లో నిద్రిస్తున్న 9 మందిపై దూసుకుపోయేది. త్రుటిలో పెద్ద ప్రమాదంతప్పింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. సుమారు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు చెబుతున్నారు. వివరాల మేరకు ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి విత్తనాల పంపిణీ ప్రారంభం

రాజవొమ్మంగి : మండలకేంద్రం రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రం వద్ద వరి విత్తనాల పంపిణీని స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ గొల్లపూడి రమణి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో అందజేస్తున్న వరి వంగడాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రైతుకు సరిపడా విత్తనాలను అందజేయాల్సిన బాధ్యత అధికారులదేనని చెప్పారు. ఆ మేరకు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, చీడి శివ, నాయకులు వీరబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి, లబ్బర్తి, శరభవరం, వాతంగిలలోని రైతు భరోసా కేంద్రాలకు తొలి విడతగా 842 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా అయ్యాయని స్థానిక వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. మరో 518 క్వింటాళ్ల వరి విత్తనాలు త్వరలోనే వస్తాయన్నారు. 30 కిలోల విత్తనాల కిట్‌కు రాయితీ పోను రైతు రూ. 120 చెల్లించాలన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, ఎంటీయూ 1121, నెల్లూరి సన్నాలు (ఎన్ఎల్ఆర్) 34449, ఎంటీయూ 1064 వంగడాలను రైతులకు సిఫారస్సు చేస్తున్నామన్నారు.

పచ్చిరొట్ట ఎరువు కోసం మండలానికి ఇప్పటికే 5 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చినట్టు ఏవో రమేష్‌నాయుడు తెలిపారు. వరి, ఇతర పంటలు పండించే నేలలో ఎకరాకు 10 కిలోల జనుము విత్తనాలు వెదజల్లుకుని 35 రోజుల తరువాత ఏపుగా పెరిగిన జనుమును నేలలో కలియదున్నాలన్నారు. ఈ పద్ధతి వల్ల పంటకు అవసరమైన నత్రజని సహజసిద్ధంగా లభిస్తుందని, తద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు.


సబ్సిడీ విత్తనాలను రైతులకు అందజేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రాజవొమ్మంగి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జడ్డంగి పీహెచ్‌సీ వైద్యాధికారి యామినిప్రియ సూచించారు. మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యామినిప్రియ మాట్లాడుతూ ఈ సీజన్‌లో ప్రబలే మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. ఇంటింటా నిర్వహిస్తున్న దోమల నివారణ మందు పిచికారీ కోసం వచ్చే సిబ్బందికి సహకరించాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై నిత్యం ఆరా తీయాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు ఉపయోగించాలని నినాదాలు చేశారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, ఎంపీహెచ్ఈవో లక్ష్మణరావు, ఎంటీఎస్ సోమరాజు, ఎల్టీ చిన్న, హెచ్వీ చిన్నాలమ్మ ఆశలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


జడ్డంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

నేత్ర శస్త్రచికిత్సలకు 20 మంది ఎంపిక


ముకుందపురం పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు


వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేసుకుంటున్న రోగులు

మాడుగుల రూరల్: విశాఖపట్నానికి చెందిన ఎల్.వి. ప్రసాదు కంటి ఆస్పత్రి సౌజన్యంతో ముకుందపురం ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కర్రి గణేష్ ప్రారంభించారు. 85 మంది రోగులకు ఆప్తాలమిక్ అసిస్టెంట్ వై. నాగలక్ష్మి పరీక్షించారు. వీరిలో 20 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. 25 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎల్వీ ప్రసాదు కంటి ఆస్పత్రి సమన్వయకర్త ఆర్. స్వాములు, సిబ్బంది హర్ష, వర్షిణి, భాగ్యలక్ష్మి, గౌరి, ఫీల్డ్ అధికారులు భూపతి, సంతోష్ పాల్గొన్నారు.

ప్రమాదం అంచున మినీ వంతెన

కోటవురట్ల : టి.జగ్గంపేట శివారు తడపర్తి గిరిజన గ్రామానికి వెళ్లే రహదారిలోని మినీ వంతెన ప్రమాద స్థితిలో ఉంది. వంతెనకు సపోర్ట్‌గా నిర్మించిన పిల్లర్లు బీటలు వారి పెచ్చులుగా రాలిపోతోంది. గిరిజనులు వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో నిత్యం పదుల సంఖ్యలో వాహనదారులు వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్ తరలించే ట్రాక్టర్, లారీ వంటి వాహనాలు కూడా నిత్యం తిరుగుతుంటాయి. వంతెన కూలిపోక ముందే మరమ్మతు చేసి ప్రమాదాన్ని నివారించాలని గిరిజనులు కోరుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ప్రమాదస్థితిలో ఉన్న వంతెన

ఘాటెక్కిన ఉల్లి.. జతకట్టిన టమాటా..


ఉల్లిపాయలు

కోటవురట్ల: ఉల్లి మళ్లీ ఘాటెక్కింది. రోజు రోజుకు పెరుగుతున్న ధర సామాన్యుడి గుండెల్లో దడపెట్టిస్తోంది. సాధారణంగా ఏ వంట కానికైనా ఉల్లి లేకుండా పనిజరగదు. ఉల్లి లేని కూర తినాలంటే ముద్ద కూడా దిగదు. ఏ కూరకైనా ఉల్లే కీలకం. కూరగాయల్లో ఉల్లే రారాజు అని చెప్పొచ్చు. అటువంటి ఉల్లి ధర ఇపుడు సామాన్యుడికి అందకుండా పైపైకి ఎగబాకుతోంది. మొన్నటి వరకు కిలో ఉల్లి ధర రూ.20 ఉండగా ప్రస్తుతం మార్కెట్లో మూడో రకం ఉల్లి కూడా రూ.40 వరకు పలుకుతోంది. దీంతో ఉల్లిని కొనాలంటే బేజారెత్తుతున్నారు. ఇక టమాటా కూడా ఉల్లికి జతకట్టింది. కొద్ది రోజుల క్రితం కిలో టమాటో రూ.15 ఉండగా ప్రస్తుతం రూ.50కు అమ్ముడవుతోంది. అల్లం చాలా కాలంగా పైనే ఉండి కిందికి రానంటోంది. ప్రస్తుతం కిలో అల్లం రూ.240 పలుకుతోంది. దాంతో పావు కిలో అల్లం కొనాలంటేనే లెక్కలు వేయాల్సివస్తోంది. ప్రధానంగా కూరల్లోకి కావలసిన ఉల్లి, టమాటో, అల్లం ధరలకు రెక్కలు రావడంతో సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోంది.